రైతుల చూపు.. ప్రకృతి వైపు

- రసాయన ఎరువుల వాడకం నిల్
- తగ్గుతున్న పెట్టుబడి ఖర్చులు
- నాణ్యమైన ఉత్పత్తులు
- అంతర పంటలతో అధిక దిగుబడి

లాభదాయకం.. ప్రకృతి వ్యవసాయం



ప్రకృతి వ్యవసాయంతో సాగవుతున్న టమాట పైరు

ఫిరంగిపురం: సాధారణ వ్యవసాయం నుంచి రైతులు ప్రకృతి వ్యవసాయం వైపునకు మారి మంచి ఫలితాలను పొందుతూ అనేకమంది రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక పెట్టుబడులు పెట్టకుండా చీడపీడల నివారణకు పలు రకాల జీవామృతాలు వాడుతూ నాణ్యమైన ఉత్పత్తులు సాధిస్తున్నారు.

మండలంలో రెండు యూనిట్లు..

మండలంలో రెండు ప్రకృతి వ్యవసాయ యూనిట్లు ఉన్నాయి. వాటిలో అమీనాబాద్ యూనిట్ పరిధిలో హౌస్‌గణేష్, అమీనాబాద్, వేములూరిపాడు, మునగపాడు గ్రామాలు ఉన్నాయి. యూనిట్ ఇంచార్జిగా రామకృష్ణ వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా తక్కెళ్లపాడు యూనిట్ పరిధిలో 113 తాళ్లూరు, గరుడాచలపాలెం, తక్కెళ్లపాడు గ్రామాలు ఉండగా దానికి యూనిట్ ఇన్‌చార్జిగా తిరుపతిరావు వ్యవహరిస్తున్నారు.

వివిధ రకాల పంటలసాగు..

ఆయా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ రైతులు తమ పంటలు పండిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో 42 ఎకరాల్లో వరి పంట వేయగా, మిర్చిపంట 102 ఎకరాలు, పత్తి 96 ఎకరాలు, మరో 22 ఎకరాల్లో కాయగూరలు అయిన చిక్కుడు, వంకాయ, టమాట, బీర, కాకర, సొరకాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు.

ఉత్పత్తులకు మేలైన ధర..

కష్టమే పెట్టుబడిగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చెప్పే పద్ధతులు పాటించి రైతులు అధిక దిగుబడులు సాధిస్తూ అధికంగా ఆదాయం సంపాదిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చిన ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుందని రైతులు చెబుతున్నారు. వరిపంట దిగుబడి 35 బస్తాలు వస్తుండగా, వాటికి మిగిలిన వరిధాన్యానికి కన్నా ఎక్కువ ధర వస్తుందని అంటున్నారు.



ఘనజీవామృతం తయారీ వివరిస్తున్న సిబ్బంది

రసాయన రహితం..

పంట మొదలైనప్పటినుంచి దుక్కిదున్నే సమయంలోనే ఘన జీవామృతం చల్లడం, పంట వేసే నారును బీజామృతంతో శుద్ధి చేయడం వంటివి చేస్తున్నారు. మొక్క ఎదుగుతున్న దశలో నీమాస్త్రం (వేపాకు, ఆవు పంచకం, ఆవు పేడతో కలిపిన) దానిని పిచికారీ చేయడం వంటివి చేస్తున్నారు. దీంతో పూర్తిగా రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి వేస్తున్నారు. దీనిద్వారా అధిక ఫలసాయం లభిస్తుందని రైతులు చెబుతున్నారు.

అంతర పంటలు..

మిర్చి పంట వేసిన రైతులుదానిలో అంతర పంటలుగా ముల్లంగి, జొన్న, సజ్జ, ఆవాలు, ఉల్లి, బంతిపూలు, పొద్దు తిరుగుడు వంటివి వేస్తున్నారు. పత్తిలో అంతర పంటలుగా గోరు చిక్కుడు, బెండ, కాకర, బీర, దోసకాయ వంటి కూరగాయలు వేస్తు అధికంగా దిగుబడితో పాటుగా లాభాలు సంపాదిస్తున్నారు.

ప్రకృతి వైపు ప్రోత్సాహం..

రెండు యూనిట్ల ద్వారా ఎనిమిది గ్రామాల్లో ఇద్దరు యూనిట్ ఇన్‌చార్జిలతో పాటుగా ఐసీఆర్‌పీ(ఇంటర్నల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు) 12 మంది, మోడల్ మేకర్లు గ్రామాల్లో రైతుల వద్దకు వెళ్లి ప్రకృతి వ్యవసాయం వైపు వారిని ప్రోత్సహిస్తున్నారు. దీంతో రసాయనిక ఎరువులు వాడి చీడపీడలతో ఇబ్బందులు పడుతున్న రైతులు సైతం ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. వారికి ఘనజీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, పంచగవ్య, దశపన్ని, బ్రహ్మాస్త్రం వంటి చీడపీడల నివారణ చేసే ప్రకృతి సిద్ధమైన వాటి తయారీ గురించి వివరిస్తున్నారు.

నష్టాలు లేవు..



నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను. నాకున్న ఎకరంతో పాటు మరికొంత పొలం కౌలుకు తీసుకున్నాను. టమాటా సాగుతో పాటు అంతర పంటలుగా కాకర, గోరు చిక్కుడు, గుమ్మడి, సొర, బీరకాయ, ఆకుకూరలు వేస్తున్నాను. ఇప్పటివరకు ఎటువంటి నష్టాలు రాలేదు.

–కె.సాంబశివరావు, రైతు, వేములూరిపాడు

దిగుబడి బాగుంది



రెండు ఎకరాల్లో వరిపంట వేశాను. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచనల మేరకు తగిన విధంగా రసాయనిక ఎరువులు వాడకుండా ఘన, జీవామృతాలు చల్లుతున్నాను. మూడేళ్లుగా ప్రకృతి వ్యవసాయం ద్వారా దిగుబడి బాగుంది.

– కె.సాంబయ్య, రైతు, వేములూరిపాడు

రైతులకు అవగాహన కల్పిస్తాం..



ప్రతి ఏటా ప్రకృతి వ్యవసాయం పంటలు వేస్తుంటాను. అంతేకాక నాకున్న ఎకరం పొలంలో అంతర పంటలుగా ఇప్పటివరకు 30 రకాలు వేశాను. మరికొందరు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తుంటాను. ఏటీఎం పద్ధతి(ఎనీటైం మనీ) ద్వారా నాణ్యతాయుతంగా దిగుబడి, అంతరపంటల సాగుతో వస్తుంది. రైతు నష్టపోవడం ఉండదు.

– ఇర్ల వెంకటేశ్వర్లు, మోడల్ మేకర్

క్లుప్తంగా

క్రీస్తు నామంతోనే రక్షణ



ఫిరంగిపురం: క్రీస్తు నామంతోనే రక్షణ చేకూరుతుందని ఫాదర్ ఎం.బాలస్వామి అన్నారు. మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక దివ్యపూజాబలి, నూతన దైవ బాలుడి నామకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాలస్వామి వాక్యోపదేశం చేస్తూ క్రీస్తు నామంతోనే శక్తి వస్తుందని చెప్పారు. బాల ఏసుదేవాలయ విచారణ గురువులు ఫాతిమా మర్రెడ్డి వాక్యోపదేశం చేస్తూ భగవంతుడి నామాన్ని జపిస్తే సర్వపాపాలు తొలగిపోతాయని చెప్పారు. క్రీస్తునకు జన్మనిచ్చిన మరియమాత ఎంతో భాగ్యవంతురాలు అన్నారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ బాల ఏసుదేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో దేవాలయ సహాయ విచారణ గురువులు బి.ప్రవీణ్‌కుమార్, వి.రవీంద్ర, మఠకన్యాస్త్రీలు, సోడాలిటీ సభ్యులు, మరియదళ సభ్యులు, గుడిపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): మతోన్మాద శక్తుల నుంచి భారత రాజ్యాంగాన్ని, మత సామరస్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీపీఎం దుగ్గిరాల మండల కార్యదర్శి జెట్టి బాలరాజు అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కరపత్రా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణ తెలియజేసి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ మూడవసారి అధికారంలోకి వచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటున్నాయని అన్నారు. బీజేపీ విధానాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరుతున్నామన్నారు. గ్రామ పంచాయితీ వైస్ ప్రెసిడెంట్ ఎం.దుర్గ, ఎం.అంజయ్య, కె.బిక్షాలు, శశిరేఖ, శ్యామల, పార్వతి, చిరంజీవి, ఎం.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి



తాడేపల్లిరూరల్: నూతన సంవత్సరం సందర్భంగా మంగళగిరి సబ్ ట్రెజరీ కార్యాలయంలో సబ్ ట్రెజరీ అధికారులు ఎ.శ్యామ్ బాబు, బి.శేషసాయిలను బుధవారం ఏపీ పెన్షనర్ అసోసియేషన్ మంగళగిరి శాఖ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్‌టీఓ శ్యామ్ బాబు మాట్లాడుతూ పెన్షనర్స్ నుంచి లైఫ్ సర్టిఫికేట్స్ తీసుకోవడం జరుగుతోందని, పెన్షనర్స్ జీవన ప్రమాణ యాప్ ద్వారా ట్రెజరీలో నమోదు చేసుకోవాలని అన్నారు. అసోసియేషన్ నాయకులు కూడా పెన్షనర్స్‌కు ఈ సమాచారాన్ని అందజేయాలని సూచించారు. సబ్ ట్రెజరీ కార్యాలయం ఆవరణలో ఎస్టీఓ గది నిర్మాణానికి సహకరించిన అసోసియేషన్‌కు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం వీరాంజనేయులు పెన్షనర్లకు స్వీట్లు, పెన్నులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.గోపిరెడ్డి, పి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు బాపనపల్లి వీరాంజనేయులు, కోశాధికారి పి.కుమారస్వామి, అసోసియేషన్ ప్రతినిధులు అందే కనకలింగేశ్వరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలో అందరికీ శుభాలు కలగాలి

- వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు
- పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఘనంగా న్యూఇయర్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వనమా బాల వజ్రబాబు

తాడికొండ: నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబానికి మేలు కలగాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) అన్నారు. బుధవారం గుంటూరు మల్లిఖార్జునపేటలోని పార్టీ తాడికొండ నియోజకవర్గ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా నియోజకవర్గంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులు ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబును(డైమండ్ బాబు)ను కలిసి పుష్పగుచ్ఛాలు, పండ్లు, స్వీట్లు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన కేక్ కట్ చేసి అందరికీ పంచారు. తుళ్ళూరు మండల నాయకులు ఆలోకం సురేష్ ప్రచురించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. మేడికొండూరు జడ్పీటీసీ కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్న, రాజేష్, పలువురు సర్పంచ్‌లు వివిధ విభాగాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడికొండలో ఏరులై పారిన మద్యం

- నిబంధనలు పాటించని మద్యం దుకాణాలు
- రాత్రి 2 గంటల వరకు అమ్మకాలు
- అనుమతులు లేకున్నా వైన్స్ షాపుల్లోనే రూములు ఏర్పాటు చేసి మరీ సిట్టింగ్

తాడికొండ: నూతన సంవత్సరం సందర్భంగా డిసెంబరు 31 రాత్రి మద్యం ఏరులై పారింది. ప్రభుత్వం వైన్స్ షాపులకు రాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్‌లకు 1 గంట వరకు మాత్రమే అనుమతి ఇవ్వగా నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కి వైన్స్ దుకాణాల్లో రాత్రి 2 గంటలు దాటే వరకు విచ్చలవిడిగా అమ్మకాలు జరపడం విశేషం. నిలువరించాల్సిన పోలీసులు రాత్రి గస్తీ పేరుతో అటు, ఇటు తిరుగుతూ కళ్లప్పగించి చూస్తుండటం తప్ప చేసిందేమీ లేకపోవడంతో మందు బాబులకు మద్యం కొనుగోలుకు కొదువ లేకుండా పోయింది. ఆరుబయట మద్యం సేవిస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తూ హల్‌చల్ చేస్తున్న పోలీసులు వైన్ షాపుల వారిపై చర్యలు తీసుకోకపోవడం విశేషం. ముందు షట్టర్ మూసి వేసి రాత్రిళ్లు వెనుక గేటు నుంచి దొడ్డిదారి అమ్మకాలు జోరుగా సాగాయి. పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకున్నా అదనపు గదులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం తాగిస్తున్నారు. వైన్స్ ఆవరణలో ఎలాంటి దుకాణాలు ఏర్పాటు చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో ఆవరణలోనే దుకాణాలు ఏర్పాటు చేసి గ్లాసులు, నీరు, సోడాలు, చిరుతిండ్లు జోరుగా అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ఈ దుకాణానికి నెలకు అమ్మకాలను బట్టి రూ.30–50 వేలు అద్దె రూపంలో తీసుకుంటున్నారు. దీంతో దుకాణదారులు రెచ్చిపోయి అధిక ధరలకు అమ్మకాలు చేస్తూ మందుబాబుల జేబులు గుల్ల చేస్తున్నారు. గ్రామాల్లో బెల్టు షాపులకు వేలం నిర్వహించడంతో అమ్మకాలను బట్టి పాటలో నెలకు రూ.20–30 వేలు అదనంగా చెల్లించి సరుకును తీసుకెళ్లి గ్రామాల్లో జోరుగా అమ్ముకుంటున్నారు. ఇంతా జరుగుతున్నా ఎక్సైజ్, స్థానిక పోలీసులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో మద్యం ఏరులై పారుతుంది. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తాడికొండలో అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అమ్మకాలు జరుపుతున్న మద్యం దుకాణం ఎదుట చూస్తూ నిల్చున్న కానిస్టేబుల్



అనుమతులు లేకున్నా.. అదనపు గదిలో కూర్చోబెట్టి మరీ తాగిస్తున్న వైన్స్ షాపు నిర్వాహకులు

విధులకు ఆటంకం కలిగించిన యువకులపై కేసు

తెనాలి రూరల్: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకులపై కేసు నమోదైంది.వివరిలిలా ఉన్నాయి. తెనాలి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాటాక రౌండ్స్‌కి తిరుగుతున్న సందర్భంలో రామలింగేశ్వరపేట పాత డిపో సెంటర్ వద్ద నలుగురు యువకులు మద్యం తాగి హల్‌చల్ చేస్తున్నారు. అదే సమయంలో పోలీసులు వెళ్ళగా వారితో ఘర్షణకు దిగి వాహనాన్ని అడ్డుకున్నారు.ఈ నేపథ్యంలో నలుగురు యువకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సర్దుబాటు చార్జీలు వెంటనే ఉపసంహరించాలి



తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారం వేయడం సరికాదని, పెంచిన సర్దుబాటు ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఉండవల్లిలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశానికి రాజధాని డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. రామారావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచమని మాట ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.15 వేల కోట్లు సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం సరికాదని అన్నారు. రోడ్ల విస్తరణ పేరుతో రాజధాని గ్రామాల్లో వందలాది పేదల ఇల్లు తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇల్లు తొలగించకుండా రోడ్డు నిర్మాణాలు చేపట్టాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తోందని, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడకర్‌ను ఉద్దేశ్యపూర్వకంగానే అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేశారని, హోం శాఖ మంత్రిగా అమిత్‌షా కొనసాగే అర్హత లేదని అన్నారు. సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, రాజధాని డివిజన్ నాయకులు వల్లభాపురం వెంకటేశ్వరరావు, టి.బక్కిరెడ్డి, ఎస్.ఇమ్మానియేల్ రాజు, పేరం బాబూరావు, కుంభ ఆంజనేయులు, బి.చెంచయ్య, ఎస్‌కె జానీ, జి.నాగేశ్వరరావు, అత్తలూరి వీర వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



ఫిరంగిపురం: గర్భిణులు సరైన పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉండగలుగుతారని బఫర్ వైద్యురాలు శాంతి అన్నారు. మండలంలోని రేపూడి గ్రామంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 95మందికి షుగర్, బీపీ, థైరాయిడ్, యూరిన్ పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించుకోవాల్సిన ఆరోగ్య పరీక్షలు గురించి అవగాహన కల్పించారు. ప్రతినెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని మందులు వాడుకోవాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ సువర్ణ, ఏఎన్‌ఎంలు వెఠంగిణీ రాణి, శివకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు



తాడికొండ: నూతన సంవత్సరం పురస్కరించుకొని తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్ని కార్యాలయాల్లో మండల స్థాయి అధికారులకు సిబ్బంది స్వీట్లు, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యాలయాలన్నీ సందడిగా మారాయి.

వైభవంగా నూతన సంవత్సర వేడుకలు



దొంతిరెడ్డి వేమారెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, దొంతిరెడ్డి వేమారెడ్డి

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యాలయంలో భారీగా ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేక్‌ను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వచ్చిన వారికి స్వీట్లు, కేక్‌లు పంపిణీ చేశారు. తాడేపల్లి పట్టణ, రూరల్ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, మంగళగిరి పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, దుగ్గిరాల శివగోపయ్య, వివిధ ప్రాంతాల నుంచి మాజీ ఎంపీటీసీలు, ప్రస్తుత సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు నానికృష్ణ, షేక్ సుభాని, ఎస్‌కే ఫిరోజ్, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. అదేవిధంగా తాడేపల్లి పట్టణ పరిధిలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు ముదిగొండ ప్రకాష్ ఆధ్వర్యంలో చర్చిలో చిన్నారులతో కలసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేశారు.



చర్చిలో చిన్నారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న ముదిగొండ ప్రకాష్

అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న కారు

తప్పిన పెనుప్రమాదం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి ప్రాతూరు రోడ్డులో మలుపు తిరుగుతున్న కారును తప్పించబోయి అతివేగంగా వస్తున్న కారు బుధవారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వాహనంలో వున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాతూరు రహదారిలోని ఓ ప్రభుత్వం కార్యాలయంనుంచి ప్రభుత్వ వాహనం కుంచనపల్లి వైపు మలుపు తిప్పుతుండగా కుంచనపల్లి నుంచి ప్రాతూరు వైపు వెళుతున్న మరో ప్రభుత్వ వాహనం అతివేగంగా వస్తూ ఢీకొట్టి రోడ్డుపక్కనే వున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. ట్రాన్స్‌ఫార్మర్ ఐదు అడుగుల ఎత్తులో బలంగా కాంక్రీట్ దిమ్మ వేయడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు, స్తంభానికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. కాంక్రీట్ దిమ్మ లేకపోతే పెను ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. అక్కడ ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు 11 కెవి, 33 కెవి కావడం, విద్యుత్ స్తంభానికి ఎటువంటి అంతరాయం కలగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి కారణమైన రెండు వాహనాలను తాడేపల్లి పోలీసులు స్వాధీనం చేసుకుని విచారణ చేస్తున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న కారును పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

రోటరీ ఆధ్వర్యంలో వేడుకలు



తాడేపల్లిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో వడ్డేశ్వరంలో బుధవారం నూతన సంవత్సర వేడకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు రావూరి రమేష్‌బాబు, సుకుమార్ రెడ్డి కేక్ కట్ చేసి అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు. క్లబ్ కోశాధికారి రవీంద్రారెడ్డి, సభ్యులు చంద్ర ఓబులారెడ్డి, శెట్టి రామకృష్ణ, డి.వి.నరసింహ, గోపు నాగరాజేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే అండ

కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: కార్యకర్తలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండ అని కార్యకర్తలకు ఏ ఆపద వచ్చినా పార్టీ అండగా వుంటుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి(డీవీఆర్) తెలిపారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో దుగ్గిరాల మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దుగ్గిరాల మండల మాజీ కన్వీనర్ శృంగారపాటి రత్నం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేమారెడ్డి మాట్లాడుతూ దుగ్గిరాల మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు తాను అండగా వుంటానన్నారు. ఇప్పటికి అనేకసార్లు చంద్రబాబు మాటలు విని జనం మోసపోయారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎన్నికలప్పుడు మాత్రమే పేదలు గుర్తుకు వస్తారని అధికారంలోకి వచ్చిన అనంతరం కార్పొరేట్లు, ధనవంతుల కోసం మాత్రమే పనిచేస్తారని విమర్శించారు. నవరత్నాల పథకాలతో ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే మళ్లీ ప్రజలకు మంచి జరుగుతుందని ఆ దిశగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మాజీ మంత్రి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ మహారాష్ట్రలో జరిగిన ఎన్నికలలో ప్రజలు ఓట్లు వేయలేదని ఈవీఎంలు ప్రధాన పాత్ర పోషించాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపణలు చేస్తుంటే అక్కడి అధికారపార్టీ సమాధానం చెప్పడం లేదన్నారు. ఈవీఎం అప్‌డేట్ అయి ఎన్నికలు జరిగితే మళ్లీ అధికారపక్షం గెలుస్తుంది తప్ప ప్రతిపక్షం గెలవదన్నారు. ఎన్నికలు ఈపద్దతిలో జరిగితే ప్రజాస్వామ్యం గెలవదని, ప్రజలు మోసపోతారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు సంఘం క్యాలెండరు ఆవిష్కరణ

తెనాలి: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, తెనాలి డివిజన్ కమిటీ ప్రచురించిన నూతన సంవత్సర క్యాలెండరును తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. రైతాంగానికి ఉపయోగపడేలా క్యాలెండరును తీసుకొచ్చిన కమిటీని అభినందించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్ మాటాలడుతూ గతంలో గ్రామంలో కరణం, గ్రామమోతుబరి దగ్గరే క్యాలెండర్ ఉండేదని, తిథి, వార, నక్షత్రాలతోపాటు వ్యవసాయ సంబంధమైన విషయాలను వారి ద్వారా తెలుసుకునే ఆనవాయితీ ఉండేదని గుర్తుచేశారు. ప్రస్తుతం రైతాంగానికి ఉపయోగపడేలా క్యాలెండరును తీసుకురావటం సంతోషంగా ఉందన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ 2025 సంవత్సరం రైతాంగానికి మేలు జరగాలని ఆకాంక్షించారు. మేకల చిట్టిబాబు, పసుపులేటి శివనాగేశ్వరరావు, ములకా శివకుమారి, షేక్ హుస్సేన్‌వలి, కేవీ సత్యనారాయణ, ఎస్.రాజ్యలక్ష్మి, భీమవరపు చినరామిరెడ్డి, మాగంటి యల్లమందయ్య, తాటి వెంకటేశ్వర్లు, ఆరికా ప్రసాద్, జి.వెంకటసుబ్బయ్య, అనిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.